క్లుప్తంగా

వేమిరెడ్డిపల్లి తండాలో 'నవోదయం'



విస్సన్నపేట: సారా తయారు చేసినా, అమ్మినా ప్రభుత్వ సంక్షేమ పథకాలు నిలిపివేస్తామని తిరువూరు రెవెన్యూ డివిజినల్ అధికారి కె. మాధురి హెచ్చరించారు. విస్సన్నపేట మండలం వేమిరెడ్డిపల్లి తండాలో నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా మంగళవారం అవగాహన సభ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ సారా కాయడం, అమ్మడం మానేసిన వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలను కొనసాగించడంతో పాటు వారికి జీవనోపాధి కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. విజయవాడ అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామశివ, విస్సన్నపేట తహసీల్దార్ కల్యాణి, ఎంపీడీఓ రాట్నాలు, ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్, ఎస్ఐలు వెంకటకుమార్, కృష్ణవేణి పాల్గొన్నారు.

కౌలు చట్టం తీసుకురావాలి

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): వచ్చే ఖరీఫ్ సీజన్ నాటికి కౌలు చట్టం తీసుకురావాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జమలయ్య, రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్నీడి యల్లమందారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక రైతు సేవా కేంద్రంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ రోహిత్ కుమార్‌కు మంగళవారం వినతిపత్రం అందజేసి నిరసన తెలిపారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడుకు వినతిపత్రం పంపించాలని కోరారు. జమలయ్య మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కౌలు రైతులను గుర్తించి నూతన కౌలుచట్టం తీసుకొస్తామని వాగ్దానం చేసి పది నెలలు గడచినా ఇంతవరకు కౌలుచట్టం తీసుకు రాలేదన్నారు. భూ యజమానులతో సంబంధం లేకుండా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు, స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ కింద రుణాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్టీఆర్ జిల్లా కౌలు రైతుల సంఘం అధ్యక్షుడు బుడ్డి రమేష్, ఉపాధ్యక్షుడు పెయ్యల వెంకటేశ్వరరావు, నిమ్మగడ్డ వాసు, పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

23 మందికి ఉద్యోగాలు

తిరువూరు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జాబ్‌మేళా కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఉపాధి కల్పనా శాఖ, డీఆర్‌డీఏ, సీడాప్ సంయుక్తంగా అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ జరిపాయి. ఎన్టీఆర్ జిల్లా ఉపాధి కల్పనాధికారి డి. విక్టర్‌బాబు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి శ్రీనివాసరావులు అభ్యర్థుల అర్హతలను పరిశీలించి ఎంపికచేశారు. డైకిన్ ఎయిర్ కండీషనింగ్, పానాసోనిక్, కేఎల్ గ్రూపు సంస్థల్లో ఉద్యోగాలకు 65 మంది హాజరు కాగా 23 మందిని ఎంపిక చేశారని కళాశాల ప్రిన్సిపాల్ సుశీలరావు తెలిపారు.

క్షీర బంధు చెక్కు అందజేత



చాట్రాయి: ఎర్రవారిగూడెం గ్రామంలోని విజయా పాల కేంద్రంలో పాలుపోస్తున్న పాడి రైతు ఉప్పలపాటి గోపాలరావు ఇటీవల మృతి చెందాడు. మంగళవారం కృష్ణా మిల్క్ యూనియన్ ఆధ్వర్యంలో క్షీర బంధు పథకం కింద రూ.50 వేల చెక్కుని పాలకవర్గ సభ్యుడు బొట్టు రామచంద్రరావు మృతుడి కుటుంబానికి అందజేశారు. రూటు సూపర్‌వైజర్ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు

ఎంపీడీఓ చేకు చినరాట్నాలు

విస్సన్నపేట: వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ చేకు చినరాట్నాలు పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. విస్సన్నపేట గ్రామ పంచాయతీ కార్యాలయంలో మంగళవారం పీ4 గ్రామ సభ నిర్వహించారు. పీ4 సర్వే లక్ష్యాలకనుగుణంగా చేసిన గణంకాల సేకరణపై సభలో చర్చించారు. అనంతరం వేసవిలో తాగునీటి సమస్యపై సమీక్ష జరిపి పంచాయతీ కార్యదర్శులు ఎప్పటికప్పుడు గ్రామాల్లో పరిస్థితిని వివరించాలని చెప్పారు. ఎంపీపీ పిల్లి మెర్సీ వనజాక్షి, సర్పంచి నాగమల్లేశ్వరి, పంచాయతీ ఈఓ హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గ్రావెల్ తరలిస్తున్న టిప్పర్లు స్వాధీనం



తిరువూరు: ఎ.కొండూరు మండలం గోపాలపురం నుంచి అనుమతి లేకుండా గ్రావెల్ తరలిస్తున్న మూడు టిప్పర్లను మంగళవారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎ.కొండూరు ఎస్ఐ చల్లా కృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. ప్రభుత్వ అనుమతి లేకుండా గ్రావెల్ తోలకాలు నిర్వహిస్తున్న టిప్పర్లను స్వాధీనం చేసుకుకుని మట్టి తోలకాలు నిర్వహిస్తున్న గోపాలపురం సర్పంచి కోలా శ్రీనుతో పాటు టిప్పర్ల డ్రైవర్లు బత్తుల శ్రీనివాస్, వేముల కొండ శ్రీనివాస్, మాలావత్ కిశోర్‌లపై వాల్టా చట్టం కింద కేసు నమోదు చేశారు.

గుప్పుమంటున్న గంజాయి

- యువతే లక్ష్యంగా జోరుగా అమ్మకాలు
- ఒడిశా, చత్తీస్‌గఢ్ నుంచి నేరుగా దిగుమతి
- హైదరాబాద్, బెంగళూరులకు ద్విచక్ర వాహనాలపై తరలింపు

తిరువూరు: యువతను చిత్తు చేసే గంజాయి, ఇతర మత్తు పదార్థాల అమ్మకాలు తిరువూరు డివిజన్‌లో జోరుగా సాగుతున్నాయి. కళాశాలలు, శివారు ప్రాంతాల్లో గంజాయి విక్రయాలు జరిపే ముఠా పోలీసులకు సైతం చిక్కట్లేదు. గంజాయి అమ్మకందారులపై పోలీసులు గత ఏడాది రెండు, ఈ ఏడాది ఇప్పటివరకు రెండు కేసులు మాత్రమే నమోదు చేయగలిగారు. చాలా పకడ్బందీగా జరుగుతున్న ఈ వ్యవహారంలో తిరువూరు రెవెన్యూ డివిజన్‌లో యువకులు అధిక సంఖ్యలో నిందితులుగా ఉన్నట్లు తెలుస్తోంది. తిరువూరులోని టౌన్‌షిప్, కోకిలంపాడు రోడ్డు, మల్లమ్మ చెరువు రోడ్డు, రాజుపేట, తోకపల్లి, విస్సన్నపేట శివారు ప్రాంతాల్లో గంజాయి అమ్మకాలు జరుగుతున్నాయి.

రవాణాలో యువకులదే పైచేయి

తిరువూరు యువకులు చత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాల నుంచి గంజాయి ప్యాకెట్లను ద్విచక్ర వాహనాలపై హైదరాబాద్, బెంగళూరు, విజయవాడ తదితర ప్రాంతాలకు తరలిస్తూ డబ్బు గడిస్తున్నారు. ఇటీవల ఎ.కొండూరు మండలం పోలిశెట్టిపాడు సమీపంలో రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో గంజాయి రవాణా చేసే యువకులు



ఎ.కొండూరు మండలం పోలిశెట్టిపాడు వద్ద స్వాధీనం చేసుకున్న గంజాయి (ఫైల్)

పరారు కాగా, ద్విచక్ర వాహనంలో గంజాయి ప్యాకెట్లు లభ్యమయ్యాయి. భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో పోలీసులు పలుమార్లు తిరువూరు పట్టణంలోని నలుగురు యువకులు గంజాయి రవాణా చేస్తుండగా పట్టుకుని కేసులు నమోదు చేశారు.

చెక్‌పోస్టుల తొలగింపుతో..

గతంలో తెలంగాణ, ఏపీ సరిహద్దుల్లో పోలీస్ చెక్‌పోస్టు ఉండటంతో అనుమానం వచ్చి వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేసేవారు. సాధారణ ఎన్నికల అనంతరం ఈ చెక్‌పోస్టులను తొలగించడంతో అక్రమ రవాణాదారులకు అడ్డే లేకుండా పోయింది. గత ఏడాది కాలంలో తిరువూరు పోలీస్ సర్కిల్లోని 12 మంది యువకులు గంజాయి రవాణాలో కీలకంగా వ్యవహరిస్తుండగా, వీరిపై పోలీసులు నమోదు చేసిన కేసుల్లో ఏడున్నర కిలోల గంజాయి, మూడు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. తిరువూరు, గంపలగూడెం, ఎ.కొండూరు మండలాలకు చెందిన కొందరు యువకులు ఇప్పటికీ గంజాయి రవాణా కొనసాగిస్తున్నారు.

మార్పునకు ప్రయత్నిస్తున్నాం



గంజాయి బారిన పడిన యువతలో మార్పు తీసుకు వచ్చేందుకు ప్రయత్నిస్తున్నాం. పలుమార్లు గంజాయి తరలిస్తూ పట్టుబడిన యువకులు, నేరాలకు పాల్పడిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటున్నాం. యువత మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

– గిరిబాబు, తిరువూరు సీఐ

మత్తులో నేరాలు

గంజాయి సేవిస్తున్న యువకులు మత్తులో ఘర్షణలకు దిగుతున్నారు. మత్తులో ఉన్నప్పుడు కుటుంబ సభ్యులు, తల్లిదండ్రులు, స్నేహితులపై సైతం విచక్షణా రహితంగా దాడులకు పాల్పడుతూ అసాంఘిక శక్తులుగా మారుతున్నారు. పలుమార్లు గంజాయి సేవించి నేరాలకు పాల్పడిన వారిపై పోలీసులు నేరచరిత్ర కలిగిన వారిగా ముద్రవేసినా వారిలో మార్పు రావడం లేదు. డ్రగ్ డీఎడిక్షన్ సెంటర్లకు వీరిని పంపే ప్రయత్నం అధికారులు చేయకపోవడంతో యథాతథంగా నేరాలకు పాల్పడుతున్నారు. గంజాయి కొనుగోలు చేయడానికి యువకులు చోరీలకు సైతం వెనుకాడటం లేదు.

పొగాకు రైతులకు మేకా ప్రతాప్ పరామర్శ

బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్

ఆగిరిపల్లి: అడివినెక్కలం గ్రామానికి చెందిన రైతుల పొగాకు పంటను దగ్ధం చేసిన వ్యక్తులను అరెస్ట్ చేసి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు డిమాండ్ చేశారు. అడవినెక్కలం గ్రామానికి చెందిన రైతులు సురేష్, జోజిబాబు పది రోజుల కిందట పొగాకు పంట కోసి పొగాకును ఎండబెట్టే క్రమంలో పొగాకు నిల్వ చేసుకునేందుకు అడవినెక్కలంలోని అంబేడ్కర్ విగ్రహం వెనకాల ఉన్న మామిడి తోటలో నిలువ ఉంచారు. సోమవారం అర్ధరాత్రి రెండు గంటలకు గుర్తుతెలియని వ్యక్తులు పొగాకు పంటకు నిప్పు పెట్టారు. భారీగా మంటలు వచ్చి పొగాకు మొత్తం కాలి బూడిదైంది. ఒక్క రూపాయి కూడా చేతికి అందకుండా రైతులు నష్టపోయారు. దాదాపుగా రూ. 8 లక్షల విలువ గల పంట నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. మంగళవారం సాయంత్రం మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ఘటనా స్థలాన్ని పరిశీలించి రైతులు సురేష్, జోజిలను పరామర్శించారు.

నిందితులను అరెస్ట్ చేయాలి..

డీఎస్పీ ప్రసాద్‌తో ఫోన్లో మాట్లాడుతూ నిరుపేదలైన రైతులు ఆరుగాలం కష్టపడి పంట చేతికొచ్చే సమయంలో దురుద్దేశంతో పొగాకు పంటను దహనం చేశారని, ఇటువంటి ఘటనలు నూజివీడు నియోజకవర్గంలో ఇప్పటివరకు ఎక్కడా జరగలేదని, నిందితులను వెంటనే అరెస్ట్ చేసి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

జెడ్పీటీసీ సభ్యులు పిన్నిబోయిన వీరబాబు, సర్పంచ్ లు వేము రాజు, లింగవరపు రమేష్, ఎంపీటీసీ సభ్యులు గుర్రం శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు మొక్కపాటి కిరణ్ కుమార్, హనుమంతరావు, రవీంద్ర రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



కాలిపోయిన పొగాకు పంటను పరిశీలిస్తున్న ప్రతాప్ అప్పారావు

శాస్త్రీయ అంశాలపై దృష్టి పెట్టాలి

తిరువూరు: ఇంజినీరింగ్ విద్యార్థులు పాఠ్యాంశాలతో పాటు శాస్త్రీయ దృక్పథంతో, సృజనాత్మకంగా ఆలోచించినప్పుడే మేధోవికాసానికి అవకాశం ఉంటుందని విజయవాడ వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాల ఫిజిక్స్ ఆచార్యులు పి. నరేష్ అన్నారు. తిరువూరు వాహినీ ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం ప్రథమ ఇంజినీరింగ్ విద్యార్థులకు ఇంజినీరింగ్ విద్యలో ఫిజిక్స్ ప్రాముఖ్యత అంశంపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి అంశాన్ని విశ్లేషణాత్మకంగా ఆలోచించినప్పుడే అనూహ్య ఫలితం వస్తుందన్నారు. విద్యార్థులు ఫిజిక్స్ సబ్జెక్టులో మంచి పట్టు సాధించాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ నాగేంద్రబాబు, చైర్మన్ పసుమర్తి వెంకటేశ్వరరావు, అధ్యాపకులు మోజెస్, కోశాధికారి కిశోర్, కరస్పాండెంట్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

తరగతుల తరలింపుపై అభ్యంతరం

నూజివీడు: చదువు చెప్పని ఉపాధ్యాయుల వల్లే తమ పిల్లలను ప్రైవేట్ స్కూళ్లకు పంపుతున్నామే గాని ప్రభుత్వ పాఠశాలల్లో చదువు చెప్తే మా పిల్లలను ప్రైవేట్ స్కూళ్లకు ఎందుకు పంపుతామని ఎస్ఎంసీ సభ్యులు విద్యా శాఖ ఆర్జేడీ, కాకినాడ జి.నాగమణిని ప్రశ్నించారు. పట్టణంలోని ఎస్ఆర్ఆర్ హైస్కూల్‌లో క్లస్టర్ రీ ఆర్గనైజేషన్ సమావేశం మంగళవారం నిర్వహించారు. పలు పాఠశాలలకు చెందిన విద్యా కమిటీ సభ్యులు తమ ఆవాస ప్రాంతంలో పాఠశాలలోని తరగతులను వేరే ఆవాస ప్రాంతంలోని పాఠశాలలో కలిపేందుకు ఒప్పుకోలేదు.

చిన్నపిల్లలకు ఇబ్బందులు..

చిన్న పిల్లలు ఒక ప్రాంతం నుంచి వేరే ప్రాంతానికి వెళ్లలేరని, వర్షాకాలం అయితే ఇబ్బందులు పడతారని పేర్కొన్నారు. మీ పాఠశాలలో నుంచి వేరే పాఠశాలలో కలపకపోతే మీ ప్రాంతానికి వచ్చే మోడల్ ప్రైమరీ స్కూల్ రాకుండా పోతుందని, మోడల్ ప్రైమరీ స్కూల్ వస్తే తరగతికి ఒక ఉపాధ్యాయుడు చొప్పున ఐదుగురు ఉపాధ్యాయులు ఉంటారని అధికారులు సర్దిచెప్పి వారిని ఒప్పించేందుకు ప్రయత్నించారు.

నూజివీడు, ఆగిరిపల్లి మండలంలో..

అలాగే నూజివీడు మండలంలో మూడు పాఠశాలలు, ఆగిరిపల్లి మండలంలో ఆరు పాఠశాలలకు అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. సమావేశంలో డీవైఈఓ ఎం.సేవ్యా, డీసీఈబీ సెక్రటరీ సర్వేశ్వరరావు, ఏఎస్ఓ రమేష్, ఆరు మండలాల ఎంఈవో-1, ఎంఈఓ-2, పాఠశాలల హెచ్ఎంలు పాల్గొన్నారు.

ముస్లింలకు వైఎస్సార్ సీపీలో సముచిత స్థానం

తిరువూరు: గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ముస్లింలకు ఎల్లవేళలా అండగా నిలబడిందని, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మైనార్టీలకు ఉప ముఖ్యమంత్రి పదవి ఇచ్చి గౌరవించారని వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్ అన్నారు. రంజాన్ మాసం సందర్భంగా తిరువూరులో మంగళవారం జరిగిన ఇఫ్తార్ విందులో అవినాష్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్లు కల్పించారని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ముస్లింల సంక్షేమానికి ఎన్నో పథకాలు అమలు చేశారని చెప్పారు. జామియా మసీదులో ముస్లింలతో కలిసి ప్రార్థనల్లో పాల్గొన్న అనంతరం లైన్ బజార్‌లో వైఎస్సార్ సీపీ మైనారిటీ విభాగం నిర్వహించిన ఇఫ్తార్ విందులో అవినాష్ పాల్గొని ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. వైఎస్సార్ సీపీ తిరువూరు నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు, తిరువూరు మండల, పట్టణ అధ్యక్షులు చలమాల సత్యనారాయణ, తాళ్లూరి నవీన్‌కుమార్, తిరువూరు నగర పంచాయతీ కౌన్సిలర్లు పరసా శ్రీనివాసరావు, మోదుగు ప్రసాద్, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ నాయకులు కాలసాని గోపాల నాగేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షులు కలకొండ రవికుమార్, యరమల రామచంద్రారెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శి ఖిజర్ ఆలీ, జాకీర్ తదితరులు పాల్గొన్నారు.



ఇఫ్తార్ విందులో పాల్గొన్న అవినాష్, స్వామిదాసు తదితరులు

విధుల్లోకి తీసుకోవాలని వినతి

మూలపాడు(ఇబ్రహీంపట్నం): మూలపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో కూటమి నేతలు తొలగించిన మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకురాలు రమణమ్మను హైకోర్టు ఉత్తర్వుల మేరకు విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ నాయకులు కోరారు. ఈ మేరకు కోర్టు ఉత్తర్వులతో పాటు వ్యక్తిగత వినతి పత్రాన్ని పాఠశాల హెచ్ఎం డేవిడ్ రాక్‌ఫెల్లర్‌కు మంగళవారం అందజేశారు. మధ్యాహ్న భోజన పథకం ఏజెన్సీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్‌సీహెచ్ సుప్రజ మాట్లాడుతూ కూటమి నాయకులు ఏజెన్సీని తొలగించడంతో పాటు కోర్టు ఉత్తర్వులు అమలు చేయకుండా హెచ్ఎంపై బెదిరింపు ధోరణికి దిగడం ఏమిటని ప్రశ్నించారు. గతంలో రమణమ్మ తయారు చేసిన చిక్కీలను నమూనాగా తీసుకుని విద్యాశాఖ అధికారులు రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయడం ఆమె గొప్పతనానికి నిదర్శనమన్నారు. 23 ఏళ్లుగా విద్యార్థులకు అమ్మలాగా చక్కటి భోజనం వడ్డిస్తున్న రమణమ్మను కూటమి ప్రభుత్వం వచ్చాక టీడీపీ పాఠశాల కమిటీ కుట్రతో తొలగించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హైకోర్టును ఆశ్రయించిన రమణమ్మకు అనుకూలంగా తీర్పు వచ్చినప్పటికీ విధుల్లో చేరనీయకుండా అడ్డుపడటం దుర్మార్గమైన చర్యగా అభివర్ణించారు. ఈ అంశంలో ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ జోక్యం చేసుకోవాలని కోరారు. కోర్టు ఉత్తర్వుల మేరకు విధుల్లోకి తీసుకుంటే ఎప్పటిలాగ విద్యార్థులకు అన్నం వడ్డిస్తూ సక్రమంగా విధులు నిర్వహిస్తానని రమణమ్మ తెలిపారు. సీఐటీయు మండల కార్యదర్శి మహేష్, భోజన ఏజెన్సీ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షురాలు రాజేశ్వరి పాల్గొన్నారు.



హెచ్ఎం డేవిడ్ రాక్‌ఫెల్లర్‌కు వినతిపత్రం అందజేస్తున్న రమణమ్మ, నాయకులు

ఐదో డివిజన్‌లో కమిషనర్ పర్యటన



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి మున్సిపాల్టీలోని ఐదో వార్డులో మున్సిపల్ కమిషనర్ రమ్యకీర్తన మంగళవారం పర్యటించారు. వార్డు పరిధిలోని తాగునీరు, పారిశుద్ధ్యం సమస్యలపై రెండు రోజుల కిందట వార్డు కౌన్సిలర్ మొగిలి దయాసాగర్ కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లి వినతి పత్రం అందజేశారు. ఈ నేపథ్యంలో వార్డులో ఆమె పర్యటించి స్థానికుల నుంచి తాగునీటి సమస్యపై ఆరా తీశారు. పారిశుద్ధ్య సమస్యలు స్వయంగా పరిశీలించారు. మున్సిపల్ కార్మికుల నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రాధాన్యతా క్రమంలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కమిషనర్ రమ్యకీర్తన తెలిపారు.

కార్మికుల సంక్షేమమే ఎంప్లాయీస్ సంఘ్ ధ్యేయం

ఎస్సీఆర్ఈఎస్ జోనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ సంతోష్ కుమార్

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): రైల్వే కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నామని ఎన్ఎఫ్ఐఆర్, ఎస్సీఆర్ ఎంప్లాయీస్ సంఘ్ జోనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆదం సంతోష్ కుమార్ అన్నారు. గుంటుపల్లి రైల్వే వ్యాగన్ వర్క్ షాపులో సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ డివిజినల్ కౌన్సిల్ సమావేశం మంగళవారం జరిగింది. ఆయన మాట్లాడుతూ కార్మికుల పెన్షన్ విధానంలో యూపీఎస్‌ని ఓపీఎస్‌గా మార్చేందుకు ఎన్ఎఫ్ఐఆర్ జాతీయ ప్రధాన కార్యదర్శి మర్రి రాఘవయ్య కేంద్రంపై ఒత్తిడి చేస్తున్నారన్నారు. రైల్వేల ప్రైవేటీకరణను నిలిపివేసి ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని, 18 నెలల కరువు భత్యం విడుదల చేయాలని ఎన్ఎఫ్ఐఆర్ వర్కింగ్ కమిటీ సభ్యుడు అరుణ్ కుమార్ కోరారు. అతిథులను దుశ్శాలువాలతో సత్కరించి మెమొంటోలు అందజేశారు. డివిజినల్ అధ్యక్షుడు బి.బాబూనాయక్, బ్రాంచి కార్యదర్శి గద్దా సురేష్, డెప్యూటీ డివిజినల్ కార్యదర్శి ఎస్ఎం ఇనాయత్ పాషా, సీడబ్ల్యూసీ మెంబర్లు, తదితరులు పాల్గొన్నారు.



అతిథులను సత్కరిస్తున్న రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ బ్రాంచి నాయకులు

ఉపాధి పనుల్లో అవకతవకలపై విచారణ

మైలవరం: చంద్రగూడెం పంచాయతీ పరిధిలో ఉపాధి హామీ పనుల్లో జరిగిన అవకతవకలపై డ్వామా విజిలెన్స్ జిల్లా అధికారి ఎన్. బాలాజీ ఆధ్వర్యంలో మంగళవారం విచారణ చేపట్టారు. చంద్రగూడెం రైతు భరోసా కేంద్రంలో మల్లె తోటలకు సంబంధించిన 26 మంది రైతులను ఒక్కొక్కరిని పిలిచి వారి వాంగ్మూలాన్ని రికార్డు చేశారు. గతంలో ముగ్గురు ఫిర్యాదు చేయగా ఇద్దరు విచారణకు వచ్చినట్లు తెలిసింది.

ఫీల్డ్ అసిస్టెంట్ సస్పెన్షన్..

రైతులకు ప్రభుత్వం అందించే రాయితీపై డబ్బులను మరొకరికి జమ చేసినట్లు ఫీల్డ్ అసిస్టెంట్ ఒప్పుకోవడంతో వారి నుంచి సొమ్ములు రికవరీ చేసి రైతులకు అందజేయాలని నిర్ణయించారు. ఫీల్డ్ అసిస్టెంట్‌ను సస్పెండ్ చేసినట్లు అధికారులు తెలిపారు. విచారణకు సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడించలేదు. ప్లాంటేషన్ మేనేజర్ ఉషారాణి, ఎంపీడీఓ అనూరాధ, ఏపీఓ వెంకటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.



రైతుల నుంచి వివరాలు సేకరిస్తున్న డ్వామా విజిలెన్స్ జిల్లా అధికారి బాలాజీ

నేడు హుండీ కానుకల లెక్కింపు

మైలవరం: బొర్రగూడెం గ్రామంలోని తిరుపతమ్మ గోపయ్య స్వామి వార్ల దేవస్థానంలో భక్తులు హుండీ ద్వారా సమర్పించిన కానుకలను బుధవారం ఉదయం 10 గంటలకు ఆలయ ప్రాంగణంలో లెక్కిస్తామని ఆలయ కార్యనిర్వాహక కార్యదర్శి తేజ తెలిపారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త, చైర్మన్ చెలికాని వెంకట సత్య వరప్రసాద్, దేవదాయ, ధర్మాదాయ శాఖ, రెవెన్యూ, పోలీస్ అధికారుల పర్యవేక్షణలో లెక్కింపు జరుగుతుందన్నారు. పాల్గొనే వారు దేవస్థానం కార్యాలయంలో తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

షాపుల వేలం

అనంతరం దేవస్థానానికి చెందిన వివిధ వ్యాపారాల నిమిత్తం ఏర్పాటు చేసిన షాపుల వేలం కార్యక్రమం జరుగుతుందన్నారు. వేలంలో పాల్గొన దలచిన వారు ఇతర వివరాల కోసం ఆలయ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

గరుడాళ్వార్ విగ్రహ ప్రతిష్ఠ

తిరువూరు: స్థానిక పాటిమీద దాసాంజనేయ స్వామి ఆలయంలో గరుడాళ్వార్ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం మంగళవారం జరిగింది. స్థానాచార్యులు ఎన్‌సీహెచ్ పాండురంగ విఠలాచార్యులు, ఆలయ ప్రధానార్చకులు మరింగంటి పార్థసారథాచార్యులు ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించిన అనంతరం విగ్రహ ప్రతిష్ఠ జరిపారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త వెల్లంకి సురేంద్రబాబు పర్యవేక్షించారు.

డీఏ విడుదల చేయాలి

మైలవరం: కూటమి ప్రభుత్వం ఉద్యోగుల డీఏ విడుదల చేయాలని పీఆర్‌టీయూ మైలవరం మండల శాఖ అధ్యక్షుడు పి. గోపాల్, సెక్రటరీ ఎం. వెంకటేష్ డిమాండ్ చేశారు. మైలవరంలోని పీఆర్‌టీయూ కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో గోపాల్ మాట్లాడుతూ ప్రభుత్వం పాత బకాయిలు విడుదల చేయడం సంతోషకరమన్నారు. ప్రస్తుతం ఉద్యోగుల పీఆర్‌సీ కొరకు నూతన కమిషనర్‌ను నియమించాలని, డీఏలు ప్రకటించాలని కోరారు. సమావేశంలో నాయకులు పాల్గొన్నారు.

1 నుంచి సదరం స్లాట్ బుకింగ్

తిరువూరు: దివ్యాంగులకు వైకల్య ధ్రువీకరణ పత్రాల జారీకై ఏప్రిల్ 1 నుంచి సదరం స్లాట్ బుకింగ్ ప్రారంభమవుతుందని తిరువూరు ఎంపీడీఓ రవిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. దివ్యాంగులు సచివాలయాలు, మీసేవా కేంద్రాల్లో ఆన్‌లైన్‌లో స్లాట్ బుక్ చేసుకుని వైద్యుల నుంచి వైకల్య ధ్రువీకరణ పత్రం పొందవచ్చన్నారు. దివ్యాంగుల పెన్షన్ల పరిశీలన నిమిత్తం గత జనవరిలో స్లాట్ బుకింగ్ నిలిపివేశామని చెప్పారు.

ఉచిత సిలిండర్‌కు నెలాఖరు వరకు అవకాశం

ఆగిరిపల్లి: దీపం-2 పథకంలో తొలి ఉచిత గ్యాస్ సిలిండర్ పొందేందుకు ఈ నెలాఖరు వరకు గడువు ఉందని స్థానిక ఇండేన్ గ్యాస్ నిర్వాహకులు పొలడుగు శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. ఇప్పటికీ పొందని వారు వెంటనే బుక్ చేసుకోవాలన్నారు.

సహస్ర దీపాలంకరణ సేవ

తిరువూరు: స్థానిక పాత తిరువూరులోని వేంకటాచలస్వామి ఆలయంలో ఫాల్గుణ మాస శ్రవణ నక్షత్రం సందర్భంగా సహస్ర దీపాలంకరణ సేవ నిర్వహించారు. ఆర్య వైశ్య ప్రముఖుడు జవాజి రాము దంపతులు స్వామివారికి విశేష పూజలు జరిపిన అనంతరం సహస్ర దీపాలంకరణ చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు దేవయాజనం వేణుగోపాలాచార్యులు పూజాదికాలు నిర్వహించారు. వైష్ణవ గోష్ఠి సభ్యులు పాల్గొన్నారు.

లో ఓల్టేజీ సమస్య పరిష్కారం

సాక్షి ఎఫెక్ట్

మునునూరు: విద్యుత్ లో ఓల్టేజీ సమస్యతో ముప్పుతిప్పలు పడుతున్న మూడు గ్రామాల ప్రజలకు ఎట్టకేలకు విముక్తి లభించింది. మూడు గ్రామాలకు లో ఓల్టేజీ విద్యుత్ సరఫరా శీర్షికన ఈ నెల ఆరో తేదీన 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. నూజివీడు ఈఈ సత్యనారాయణ ఆధ్వర్యంలో మరమ్మతులు చేపట్టారు. మంగళవారంతో మరమ్మతులు పూర్తయి మూడు గ్రామాల ప్రజల సమస్య పరిష్కారమైంది. బుధవారం నుంచి మూడు గ్రామాల్లో ఉదయం ఆరు నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు వ్యవసాయ విద్యుత్ సరఫరా అందిస్తామని ఈఈ తెలిపారు.

భూసార పరీక్షలతో మేలు

మునునూరు: రైతులంతా భూసార పరీక్షలు చేయించుకోవాలని వ్యవసాయ శాఖ ఏఈఓ రామకృష్ణ అన్నారు. అక్కిరెడ్డిగూడెం, రమణక్కపేట ఆర్ఎస్‌కేల వద్ద మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మట్టి నమూనా సేకరణ, భూసార పరీక్షలు చేయించడం వల్ల కలిగే లాభాలను రైతులకు వివరించారు. ఈ-క్రాప్ నమోదు, పంటల బీమా చెల్లింపు తదితర అంశాలను రైతులకు తెలిపారు. అనంతరం మొక్కజొన్న పంటను పరిశీలించారు. కార్యక్రమంలో వీహెచ్ఏలు, రైతులు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు

జి.కొండూరు: పశువులకు ప్రత్యేక వైద్య శిబిరం కవులూరు గ్రామంలో మంగళవారం నిర్వహించారు. జిల్లా పశు వైద్యాధికారి డాక్టర్ ఎం. హనుమంతరావు మాట్లాడుతూ పశువుల సంరక్షణపై రైతులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా గాలికుంటు వ్యాధి నివారణ, నత్తల నివారణ మందులు వేయడంతో పాటు మినరల్ మిక్చర్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. పశు వైద్య శాఖ డీడీ డాక్టర్ రమేష్, మండల వైద్యాధికారులు డాక్టర్ ఎస్. శైలజ, డాక్టర్ మురళీకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'

తిరువూరురూరల్: మండలంలోని కాకర్ల, లక్ష్మీపురం గ్రామాల్లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయాధికారి పద్మ రైతులకు భూ ఆధార్, రైతు రిజిస్ట్రేషన్ ఆవశ్యకతను వివరించారు. ఈ నెల 31 లోగా రైతు సేవా కేంద్రాల్లో తమ వివరాలు నమోదు చేయించుకోవాలని సూచించారు. ఏఈఓ కావ్యసింధు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు

మైలవరం: రెడ్డిగూడెం మండలం రంగాపురం గ్రామ శివారు రెడ్డికుంట వద్ద ఆర్ అండ్ బీ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. రెడ్డిగూడెం మండలం ఓబులాపురం గ్రామానికి చెందిన రాయల ప్రసాద్, నాగలక్ష్మీ దంపతులు తమ రెండేళ్ల కుమారుడు లక్కీతో కలిసి ఓబులాపురం నుంచి తాడిగూడెం మీదుగా విస్సన్నపేట బయలుదేరారు. అదే రహదారిలో రెడ్డిగూడెం నుంచి బూరుగగూడెం వెళ్లేందుకు చాట్ల వివేక్, వల్లూరి గణేష్ తమ ద్విచక్ర వాహనంపై వెళుతుండగా ఎదురుగా వస్తున్న వ్యాన్‌ను తప్పించే క్రమంలో రాయల ప్రసాద్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో లక్కీతో పాటు వివేక్, గణేష్ కూడా తీవ్రంగా గాయపడ్డారు. బాధితులను విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రెడ్డిగూడెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సారా తయారీదారుల అరెస్ట్

తిరువూరు: తిరువూరు ఎక్సైజ్ సర్కిల్‌లో మంగళవారం సారా తయారీదారులను అరెస్టు చేశామని ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ జె. శ్రీనివాస్ తెలిపారు. ఎ.కొండూరు మండలం కేశ్యా తండాలో భరోతు పార్వతి నుంచి ఐదు లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామని, అదే తండాలో సారా విక్రయించే భరోతు హరిబాబుపై కూడా కేసు నమోదు చేశామని చెప్పారు.